క్లుప్తంగా

నేడు 'రైతు నేస్తం'

నడిగూడెం : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఈ ఈ కార్యక్రమం ఉంటుందని, పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆవోపా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ : ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ మండలంలోని ఆర్యవైశ్య పేద, మెరిట్ విద్యార్థులకు ప్రతి ఏటా అందజేసే స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.సతీష్‌కుమార్, పి.శ్రీనివాస్‌లు సోమవారం తెలిపారు. ఈనెల 23 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వారు చెప్పారు. ఆర్యవైశ్య పేద మెరిట్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కరాటేలో స్టూడెంట్ కోఫోఖాన్ క్లబ్ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో కోదాడ పట్టణానికి చెందిన స్టూడెంట్ కోఫోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభ చూపి పలు విభాగాల్లో పథకాలు సాధించినట్లు కోచ్, కోఫోఖాన్ తెలంగాణ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఆరె మాధవిలత సోమవారం విలేకరులకు తెలిపారు. సాన్విత, మణికంఠ గోల్డ్‌మెడల్, మీరా, నాగరుద్ర సిల్వర్ మెడల్, తీర్ధ, నోహిత్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ కన్నన్‌గౌడ్, రుద్రమదేవి అకాడమీ చీఫ్ రవి చేతుల మీదుగా పతకాలు అందజేశారు.

చెరువులు, కుంటలు నింపాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణప్రసాద్

మునగాల : సాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపాలని బీజేపీ మండల అధ్యక్షుడు భద్రరాజు కృష్ణప్రసాద్ కోరారు. ఈమేరకు సోమవారం మునగాల తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సాగర్ నీటిని పాలేరు జలాశయానికి తరలిస్తూ సాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపకపోవడం సరైనది కాదన్నారు. నాన్ ఆయకట్టు గ్రామాలైన జగన్నాథపురం, కలకోవ, నరసింహులగూడెం, రేపాల తదితర గ్రామాల్లో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చొరవ చూపి చెరువులు, కుంటలు నింపాలని కోరారు.

పేకాట స్థావరాలపై దాడులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని నక్కగూడెంలో సోమవారం పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నక్కగూడెం గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. మూడు ఇళ్లలో దాడులు జరిపి పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. పట్టుబడ్డ వారి నుంచి రూ 1.17 లక్షల నగదు, ఒక మోటార్ సైకిల్, 9 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'అంగన్‌వాడీల్లో మూడవ తరగతి' సహేతుకం కాదు

గరిడేపల్లి : అంగన్‌వాడీల్లో మూడవ తరగతి వరకు చదువు చెప్పాలనే ప్రభుత్వ నిర్ణయం సహేతుకం కాదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గరిడేపల్లి మండల బాధ్యుడు ఎలక సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, యూకేజీ (ప్రీ ప్రైమరీ) తరగతులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఏటేటా తగ్గుతున్నాయని తెలిపారు. మూడవ తరగతి వరకు అంగన్‌వాడీల్లో విద్యాబోధన ఉంటుందన్న ప్రభుత్వ నిర్ణయంతో ప్రాథమిక పాఠశాలకు తీవ్ర నష్టం కలిగే అవకాశముందన్నారు. అంగన్‌వాడీలకు విద్యా శాఖతో సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) పథకం కింద అంగన్‌వాడీలు పనిచేస్తాయన్నారు. అవి స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉంటాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యాశాఖతో సంబంధం లేకుండా మూడవ తరగతి విద్యా బోధన ఎలా అమలవుతుందని ఆయన ప్రశ్నించారు.

మౌలిక వసతులు లేక ఇబ్బందులు

- డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు కరువు
- చెన్నాకేశ్వాపురంలో పిల్లర్ల దశలోనే నిలిచిన నిర్మాణ పనులు


సిరిపురంలో మౌలిక వసతులు లేని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీ

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాల్లోని డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. చెన్నకేశ్వాపురంలో మూడేళ్ల కిందట చేపట్టిన 20 ఇళ్ల నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. ఇక సిరిపురం, కాగితరామచంద్రపురంలో గల డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద వసతులు లేవు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం అయినా దృష్టి సారించి డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద వసతులు కల్పిస్తుందని, నిలిచిపోయిన ఇళ్ల పనులు పూర్తి చేసి పంపిణీ చేస్తుందని పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సిరిపురంలో వసతులు కరువు..

సిరిపురంలో గత ప్రభుత్వం 40 ఇళ్లు నిర్మించింది. కానీ అక్కడ కనీస మౌలిక వసతులైన సీసీ రోడ్లు, డ్రైయినేజీ, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. అధికారులు ఆర్భాటంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు పంపిణీ చేశారు. ఇప్పుడు కనీస వసతులు లేకపోవడంతో అక్కడ నాలుగైదు కుటుంబాలు మాత్రమే ఉంటున్నారు. వారు కూడా సమస్యలతో సతమతమవుతూ జీవిస్తున్నారు.

కాగితరామచంద్రాపురంలో ఇలా..

కాగితరామచంద్రాపురంలో 50 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కానీ వసతులు కల్పించడం మాత్రం మరిచారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీ, విద్యుత్ సౌకర్యం లేక అక్కడ నివసించే పేదలు ఇబ్బందులు పడుతున్నారు.


చెన్నకేశ్వాపురంలో పిల్లర్ల దశలోనే నిలిచిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు

ఇబ్బందులు పడుతున్నాం



సిరిపురంలోని డబుల్ బెడ్ రూం కాలనీలో రోడ్లు, విద్యుత్ సౌకర్యం, డ్రైయినేజీ, తాగునీటి సదుపాయం లేదు. అయినప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లోనే ఇబ్బందులు పడుతూ ఉంటున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి.
– ఆత్కూరి గుర్వయ్య, సిరిపురం

ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి



మా గ్రామంలో 20 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. దీంతో పేదలకు నిరాశే మిగిలింది. సంబంధిత అధికారులు స్పందించి ఇళ్ల పనులు పూర్తి చేసి పంపిణీ చేయాలి.
– పచ్చిగోళ్ల శ్రీను, చెన్నకేశ్వాపురం

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు తెరిచి 2 నెలలు అవుతున్నా ఇప్పటికీ విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులకు గురౌతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ నాయకులు భానుప్రకాష్, నరేందర్, అనిల్, మోహన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహజ్యోతి' వర్తింపజేయాలి

మునగాల : అనేకమంది పేదలకు గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందడం లేదని, అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య అన్నారు. సోమవారం మునగాలలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని 7 నెలలు పూర్తవుతున్నా అనేక మంది ఇళ్లకు జీరో బిల్లు రావడం లేదని, విద్యుత్ శాఖ సిబ్బంది బిల్లులు కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి వెంకమ్మ, మాసిరెడ్డి రమాదేవి, దాసరి హేమలత, మద్దూరి జయమ్మ పాల్గొన్నారు.

మాదిగల మహాధర్నా కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆగస్టు 9న నిర్వహించబోయే మాదిగల మహాధర్నాను జయప్రదం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబుమాదిగ పిలుపునిచ్చారు. సోమవారం కోదాడ పట్టణంలోని హరిజన వాడలో ఆయన ధర్నా కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని మాదిగలకు హామీ ఇచ్చి పదేళ్లు గడుస్తున్నా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బాణాల అబ్రహం, పట్టణ అధ్యక్షుడు ఏర్పుల చిన్ని మాదిగ, నాగేశ్వరరావు, స్వామి, బాబురావు, కాశీ, శ్రీను, అనిల్, రాము, యాకోబ్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత


బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాగిశెట్టి శ్రీను ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం పెద్ద కర్మ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య ఆధ్వర్యంలో గ్రామ శాఖ నాయకులు శ్రీను కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ యూత్ మండల శాఖ అధ్యక్షుడు జిల్లేపల్లి శ్రీనివాస్, నాయకులు సొంపంగు గోపి, కొండమీది గుర్వయ్య, లొడంగి మహేష్, జిల్లేపల్లి వినయ్, కోట ప్రవీణ్, రాగిశెట్టి లింగయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌ఐ సైదులు

గరిడేపల్లి : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సైదులు అన్నారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని కస్తూ రిబా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై పోలీసు కళాబృందంతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణకు పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కానీ సైబర్ మోసలకు గురికావద్దన్నారు. బ్యాంకు ఖాతా, ఓటీపీ, ఏటీఎం కార్డు వివరాలు ఇతరులకు తెలపవద్దని అన్నారు. అనంతరం పోలీసు కళాబృందం ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎస్‌ఓ శైలజ, కానిస్టేబుల్ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపి, గురులింగం, క్రిష్ణ, చారి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు నిబంధన తొలగించాలి

మోతె : రైతు రుణ మాఫీ రేషన్ కార్డు నిబంధన తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మోతె మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయలేదని అన్నారు. రైతు కుటుంబం గుర్తింపుకు ఆహార భద్రత కార్డు ప్రమాణికంగా తీసుకోవడం సరైంది కాదన్నారు. రేషన్ కార్డు నిబంధనతో అనేక మంది రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోతారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ములుగూరు గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యుడు గుంటగాని ఏసు, కిన్నెర పోతయ్య, సోమగాని మల్లయ్య, జంపాల స్వరాజ్యం, గుగులోతు కృష్ణ, వెలుగు మధు, లింగయ్య, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణాలతో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామీ అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతను పూర్తి గావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విదంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌తండాలో తీజ్ వేడుకలు


తీజ్ వేడుకలో పాల్గొన్న గిరిజన యువత


గోదుమనారు బుట్టతో చిన్నారి

మఠంపల్లి : మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో సోమవారం గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతులంతా గోదుమనారు బుట్టలు ఎత్తుకుని తుల్జాభవానీ ఆలయం వద్దకు చేరుకుని ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా నాగమణి, కోటేష్‌నాయక్, రాజునాయక్, కొండానాయక్, గ్రామ పెద్దలు, గిరిజన యువత పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

గరిడేపల్లి : జూన్ 28 వరకు కొత్తగా పట్టాదారు పాసు బుక్ పొందిన రైతులు, ఇంతవరకు రైతు బీమా నమోదు చేసుకోని వారు ఆగస్టు 4వ తేదీలోపు రైతుబీమా నమోదు చేసుకోవాలని ఏఓ ప్రీయతంకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 30వ తేదీ వరకు రైతుబీమాలో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాసు బుక్, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్ తీసుకొని కార్యాలయానికి రావాలని ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులని ఆయన తెలిపారు.

మునగాల : మండలంలో కొత్తగా పాస్ బుక్ పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది జూన్ 28 లోపు కొత్త పాస్ పుస్తకం పొందిన వారు ఆగస్టు 15లోగా దరఖాస్తులను ఏఈఓలకు అందించాలని తెలిపారు. రైతులు దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్ ప్రతులను జత చేసి వ్యవసాయ శాఖ క్లస్టర్ కార్యాలయంలో ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : కొత్తగా పట్టదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు, పట్టా పాస్‌బుక్‌లు ఉండి ఇప్పటివరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని హుజూర్‌నగర్ మండల వ్యవసాయ అధికారిణి రావిరాల స్వర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్ కాపీలను ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలని ఆమె సూచించారు.

ఇక నుంచి యూరిన్ టెస్ట్‌తో గంజాయి నిర్ధారణ

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : గంజాయి తాగుతున్న అనుమానితులకు ఇక నుంచి యూరిన్ టెస్ట్‌లు నిర్వహిస్తామని, మెడికల్ రిపోర్టులో గంజాయి తాగినట్లు నిర్ధారణ అయితే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే టెస్టింగ్ కిట్లు స్టేషన్‌లకు వచ్చాయని పేర్కొన్నారు. గంజాయికి బానిసలైన వారిని గుర్తించి డీఅడిక్షన్ సెంటర్లకు పంపిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, గంజాయి అక్రమ రవాణా చేసినా, తాగుతున్న వారిపై చర్యలు తప్పవని తెలిపారు. కోదాడ డివిజన్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్నా, తాగుతున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్

హుజూర్‌నగర్ : నూతన చట్టాలపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ హాల్‌లో నూతన అడ్వకేట్‌గా అజ్మీరా చందు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి అనేది అత్యంత క్రమశిక్షణ, అంకితభావంతో చేసే వృత్తి అని అన్నారు. న్యాయవాదులు కష్టపడి పనిచేస్తే ఫలితం అదే వస్తుందని, కక్షిదారులకు న్యాయం చేసే విధంగా వృత్తిలో రాణించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌సీజే కోర్టు ఏజీపీ నట్టే సత్యనారాయణ, జేసీజే కోర్టు ఏజీపీ సురేష్‌నాయక్, బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నగేష్ రాథోడ్, న్యాయవాదులు గోపాలకృష్ణమూర్తి, జె.సత్యనారాయణ, యాదగిరి, రమణారెడ్డి, అంజయ్య, శ్రీనివాసరావు, శంకర్, సురేష్, ప్రదీప్తి, నాగేశ్వరరావు, క్రాంతికుమార్, సంధ్య, నాగార్జున, రాముడు, నాగూర్ బాషా, మహేష్, మోహన్, వీరు, తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌ఎన్‌రావు సేవలు చిరస్మరణీయం


కేఎల్‌ఎన్‌రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామవెలుగు నాట్యమండలి సభ్యులు

మునగాల : మండలంలోని రేపాల గ్రామానికి చెందిన ప్రముఖ నాటక రచయిత, కవి కోదాటి లక్ష్మీనరసింహారావు(కేఎల్‌ఎన్‌రావు) కళా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని గ్రామ వెలుగు నాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు మొగిలిచర్ల సత్యనారాయణ, సారిక పెదరామయ్య అన్నారు. కేఎల్‌ఎన్‌రావు 21 వర్ధంతి సందర్భంగా రేపాలలో వారు ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటక రంగంలో ఎన్నో బహుమతులు అందుకొని గ్రామవెలుగు నాట్యమండలి స్థాపించి ఎందరినో కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనత కేఎల్‌ఎన్‌రావుకే దక్కిందన్నారు. దూరదర్శన్‌లో ఆర్టిస్టుగా పనిచేసిన కేఎల్‌ఎన్‌రావు ద్వారా రేపాలకు ఎంతో గుర్తింపు వచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో కేఎల్ ట్రస్టు మెమోరియల్ ప్రధాన కార్యదర్శి పందిరి పుల్లారెడ్డి, తెలంగాణ నాటక సమాజాల సమైక్య మండల శాఖ అధ్యక్షుడు పానుగోటి రంగా, గ్రామ వెలుగు నాట్యమండలి కళాకారులు గవిని పెదలక్ష్మీనరసింహం, సొంటి పరశరాములు, గండు నారాయణ, గండు పరుశరాములు, తోకల సైదులు, గండు వీరయ్య, ఎల్లబోయిన వాసు, గండు సత్యనారాయణ మాస్టర్ పాల్గొన్నారు.

గోరింటాకు పండుగ



హుజూర్‌నగర్ పట్టణంలోని 4వ వార్డులో మహిళలు ఆషాఢమాస గోరింటాకు పండుగను సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని ఆనందంగా గడిపారు.
– హుజూర్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి


హుజూర్‌నగర్‌రూరల్ : సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు


కోదాడరూరల్ : గుడిబండలో సీఎం, మంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు రుణమాఫీ చేసి రైతుల పక్షపాతిగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి గ్రామంలో రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు పీఏసీఎస్ చైర్మన్ కట్టా గోపాలరావుతో కలిసి పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గుండెపంగు బాబు, శీలం నర్సింహారావు, మాజీ ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మి, రాఘవయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం

కోదాడరూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీని హర్షిస్తూ సోమవారం మండలంలోని గుడిబండలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇర్ల సీతారాంరెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, ఇర్ల నర్సింహారెడ్డి, ఎండీ.రఫీ, వాచేపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఓరుగంటి రామకృష్ణారెడ్డి, కుక్కడపు సైదులు, పులి రాజారావు, హసన్‌అలీ, నరోత్తమరెడ్డి ఉన్నారు.

బురదమయంగా ప్రభుత్వ కార్యాలయాలు


బురదమయంగా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణ

నేరేడుచర్ల : పట్టణంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయ ఆవరణ బురదమయంగా మారింది. కార్యాలయ ఆవరణ గుంతలమయంగా మారి గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ సలహాలు, సూచనలు ఇచ్చే అధికారుల కార్యాలయాల్లోనే ఈ దుస్థితి నెలకొనడంతో అక్కడికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ జ్యోతి తెలిపారు. రేషన్ బియ్యం నిల్వ చేసిన ఇంటి యాజమాని గజ్జెల కొండారెడ్డి, రేషన్ డీలరు మామిడి వీరబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని హుజూర్‌నగర్ స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. వారి వెంట సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ వాసుదేవరావు తదితరులున్నారు.